## క్లుప్తంగా

### 18న ప్రత్యేక లోక్ అదాలత్


సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు రూరల్: పుత్తూరు సబ్‌కోర్టు ఆవరణలో ఈనెల 18న ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు స్థానిక సీనియర్ సివిల్ జడ్జి ఎస్.సి.రాఘవేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుటుంబ కేసుల రాజీ నిమిత్తం నిర్వహిస్తున్న లోక్ అదాలత్‌లో మనోవర్తి, గృహహింస, రాజీకి లోబడిన వివాహ సంబంధ కేసులను పరిష్కరించుకోవచ్చునని వివరించారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

### నేడు వాహనాల వేలం

వెదురుకుప్పం: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను గురువారం ఉదయం 10 గంటలకు వెదురుకుప్పం పోలీసు స్టేషన్ ఆవరణలో వేలం వేయనున్నట్లు ఏఎస్ఐ వెంకటేశ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వేలంలో పాల్గొనే వారు ముందుగా రశీదులు తీసుకోవాలని కోరారు. కార్వేటినగరం సీఐ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు వేలం పాట జరుగుతుందని చెప్పారు. వివరాలకు 9440900691 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

**వడమాలపేటలో..**

వడమాలపేట : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన ద్విచక్రవాహనాలను బుధవారం తిరుపతి ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహిచారు. మొత్తం 9 ద్విచక్రవాహనాలకు వేలం నిర్వహించగా హెచ్చు పాటదారులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో స్టేషన్ రైటర్ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య

గంగాధరనెల్లూరు: మతిస్థిమితం లేని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని గంగిరెడ్డికండిగ గ్రామంలో చోటుచేసుకుంది. ఏఎస్ఐ మనోహర్ తెలిపిన వివరాలిలు.. యాదమరి మండలం చిన్నిరెడ్డిపల్లికి చెందిన హేమచంద్రారెడ్డికి మతిస్థిమితం లేదు. ఈయన గంగిరెడ్డికండిగ గ్రామంలోని బంధువుల ఇంటికి గత మూడు రోజుల క్రితం వచ్చాడు. వారి మామిడితోటలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం పశువుల కాపర్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. శవాన్ని పోస్టుమార్టం కోసం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏఎస్ఐ తెలిపారు.

### వైభవంగా అష్టమి పూజలు

నగరి : పట్టణ పరిధిలో కరకంతేశ్వర స్వామి ఆలయంలో శ్రీ కాళభైరవ అష్టమి పూజలు బుధవారం వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయంలోని కాళభైరవ సన్నిధిలో సహస్రనామావళి అష్టోత్తర నామావళి పూజలు నిర్వహించారు. అనంతరం కాళభైరవ స్వామికి అభిషేక పూజలు నిర్వహించి పుష్పాలతో అలంకరించారు. ఉభయదారులకు ఆలయ నిర్వాహకులు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం, ప్రధాన అర్చకులు ఆలయ కమిటీ నిర్వాహకులు పాల్గొన్నారు.

### ఉగాది రోజున శ్రీకృష్ణుడికి పాలాభిషేకం


కాళభైరవస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

పుత్తూరు రూరల్: ఈనెల 22న తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను పురస్కరించుకుని శ్రీకృష్ణుడికి పాలాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటి చైర్మన్ లారీమోహన్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక శ్రీద్రౌపదీదేవి సమేత శ్రీధర్మరాజులస్వామి ఆలయం నుంచి ద్రౌపదీదేవి ఉత్సవమూర్తిని పట్టణ మహిళలు పాల కలశాలతో ఊరేగింపుగా శ్రీకామాక్షీ సమేత శ్రీసదాశివేశ్వరస్వామి ఆలయానికి చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో పాల్గొనే మహిళలు ఈనెల 20వ తేదీలోపు తమ పేర్లను ద్రౌపదీదేవి ఆలయంలో నమోదు చేసుకోవాలని కోరారు.

### వివాద స్థల పరిశీలన

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయతీ మొరవ మోడల్ కాలనీలో గత కొంతకాలంగా ఇంటి స్థలం విషయంలో వివాదంపై అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించారు. మొరవ గ్రామానికి సమీపంలో సర్వే నంబర్ 221-5లో ప్రభుత్వ స్థలంలో బీసీ వర్గానికి చెందిన కొందరు పునాదులు వేస్తున్నారని, అదే గ్రామానికి చెందిన ఎస్సీలు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వీఆర్ఓ బాబు బుధవారం వివాదాస్పద స్థలాన్ని పరిశీలించారు. అధికారుల అనుమతి లేకుండా ఎవరూ ఇంటి నిర్మాణం చేపట్టకూడదని హెచ్చరికలు జారీ చేశారు. దీంతో ఇదే కాలనీలో కొందరు పట్టాలు లేకనే ఇళ్లు నిర్మించుకుంటున్నట్లు బీసీవర్గం వారు వీఆర్ఓతో వాగ్వాదానికి దిగారు. స్థానిక సర్పంచ్ భారతి కలుగజేసుకుని ప్రభుత్వ స్థలాన్ని చదును చేసి ఇళ్లు లేని వారికి ఇంటి స్థలం మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. బీసీలకు కూడా ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి తమకు ఎలాంటి అభ్యంతరం లేదని బోగస్ పట్టాలను ఏరివేయడానికి సహకరించాలని కోరారు. వీఆర్ఓ బాబు మాట్లాడుతూ ఆక్రమణదారులపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

# ఇది పరీక్షల కాలం..

పరీక్షల కాలం నడుస్తోంది. ఒకవైపు ఉపాధ్యాయులు మెరుగైన ఫలితాల కోసం కార్యాచరణ అమలు చేస్తుండగా.. మరోవైపు విద్యార్థులు పూర్తిస్థాయిలో పరీక్షలకు సిద్ధమవుతున్నారు. నెలల తరబడి నేర్చుకున్న పాఠాలను ప్రణాళికాబద్ధంగా పునశ్చరణ చేసుకోవాలని విద్యావేత్తలు సూచిస్తున్నారు. స్కూళ్లు, కాలేజీల్లో చదువుల్లో వెనకబడిన విద్యార్థులను గుర్తించి మరింత శ్రద్ధతో పాఠ్యాంశాలు బోధించి పరీక్షలకు సిద్ధం చేశారు.

- మొదటిరోజు ప్రశాంతంగా ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్ష
- నేటి నుంచి ఇంటర్ సెకండియర్ పరీక్షలు
- ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా అధికారుల కసరత్తు
- విద్యార్థులు జంక్‌ఫుడ్‌లను పక్కన పెట్టాలంటున్న నిపుణులు


పరీక్ష సెంటర్ వద్ద నోటీసు బోర్డులో గది నంబర్లను సరి చూసుకుంటున్న విద్యార్థులు


పీసీఎన్ జూనియర్ కళాశాలలో పరీక్ష రాస్తున్న మొదటి సంవత్సరం విద్యార్థులు

నగరి: ప్రస్తుతం ఇంటర్ పరీక్షలు ప్రారంభం కావడంతో అటు విద్యార్థులకు, ఇటు ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు ఒక రకంగా చెప్పాలంటే నిజంగా పరీక్షా కాలమే. ఇన్ని రోజుల్లో చదివిన వాటిని పరీక్షల్లో బాగా రాసి మంచి ఫలితాలు సాధించే తరుణమిది. నియోజకవర్గ పరిధిలోని నగరి, పుత్తూరు, నింద్ర, విజయపురం, వడమాలపేట మండలాల్లో సుమారు 4500 మంది విద్యార్థులు ఇంటర్ చదువుతున్నారు. అలాగే ఈసారి సుమారు 3500 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. బుధవారం జరిగిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ పరీక్షల్లో నగరిలో 981 మంది విద్యార్థులకు గాను 957 మంది విద్యార్థులు హాజరయ్యారు. గురువారం నుంచి ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 3 నుంచి పదోతరగతి పరీక్షలు ప్రారంభం అవుతాయి. విద్యార్థులకు పరీక్షలు జరుగుతున్న తరుణంలో సమయాన్ని ఎంత తెలివిగా వాడుకుంటే అంత ఎక్కువ స్కోర్ చేయెచ్చు. పాత మోడల్ పేపర్లను ప్రాక్టీస్ చేసుకుంటే మంచిదని నిపుణులు చెబుతున్నారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నపుడే ఆత్మవిశ్వాసంతో పరీక్ష రాయగలరు. అందుకే ప్రిపరేషన్‌లో పడి ఆరోగ్యాన్ని అశ్రద్ధ చేయకూడదు. జంక్‌ఫుడ్‌లకు దూరంగా ఉండి ప్రోటీన్లతో కూడిన సమతుల ఆహారం తీసుకోవాలి. రోజుకు 7 నుంచి 8 గంటల నిద్రతో పాటు కొద్ది పాటి వ్యాయామం, మెడిటేషన్ వంటివి చేయడం మంచిది. అనవసర ఒత్తిళ్లకు దూరంగా ఉంటూ ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తూ ప్రణాళికతో చదువుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చని వైద్యులు చెబుతున్నారు.

**ప్రశాంతంగా ఉండాలి..**



విద్యార్థులు ప్రశాంతంగా ఉంటే వారి ఆలోచన బాగుంటుంది. పరీక్షలు బాగా రాయగలుగుతారు. ఆరోగ్యంగా ఉంటే మానసికంగా, దృఢంగా ఉండగలుగుతారు. ఒత్తిడికి గురైతే సమయం వృథా అయిపోతుంది. జంక్‌ఫుడ్‌లకు దూరంగా ఉండి ప్రోటీన్లతో కూడిన సమతుల ఆహారం తీసుకోవాలి.

– డాక్టర్ రవిరాజు, డీఐఓ, చిత్తూరు

**పకడ్బందీగా పరీక్షలు**



ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తున్నాం. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా చర్యలు తీసుకున్నాం. సీసీ కెమెరాల నిఘాలో పరీక్షలు నిర్వహించనున్నాం. చిట్టీలు తీసుకువచ్చి పరీక్ష రాయాలని చూసినా, ముందున్న విద్యార్థుల జవాబులను చూసిరాసినా తప్పనిసరిగా డీబార్ అవుతారు. విద్యార్థులకు వీలుగా ఏ గదిలో పరీక్షలు రాయాలో సూచించే నోటీసుబోర్డు కళాశాల వద్ద ఉంచుతాం.

– కె.వెంకటాచలపతి, ప్రిన్సిపల్, పీసీఎన్ జూనియర్ కళాశాల, నగరి

**సమయానికి హాజరుకావాలి..**



విద్యార్థులకు ఉదయం 9 గంటలకు పరీక్షలు ప్రారంభం అవుతుంది. వారు 8.45 గంటలకు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి. 9 గంటలు దాటితే హాలులోకి అనుమతించడం జరగదు. పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులకు అన్ని వసతులు ఉంటాయి. విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాం.

– వెంకటరమణాచార్యులు, ఎంఎస్ఎంఎన్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, నగరి

## మసీదుల మరమ్మతులకు నిధులు ఇవ్వండి


సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో మంత్రులు ఆర్కే రోజా, అంజాద్ బాషా

పుత్తూరు రూరల్: నగరి నియోజకవర్గంలోని మసీదుల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా విజ్ఞప్తి చేశారు. బుధవారం సాయంత్రం సీఎం క్యాంపు కార్యాలయంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన మంత్రి రోజా పుత్తూరులో రూ.1.85 కోట్లతో నిర్మిస్తున్న షాదీమహల్ పనులు పూర్తవుతున్నాయని తెలిపారు. అలాగే రంజాన్ ఉపవాసాలు ప్రారంభం అవుతున్నాయని, ఈ సందర్భంగా మసీదుల అభివృద్ధికి సహకరించాలని కోరారు. దీనిపై సీఎం సానుకూలంగా స్పందించినట్లు మంత్రి తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ డైరెక్టర్ వీఎం మాహిన్ పాల్గొన్నారు.

## వందశాతం ఉత్తీర్ణతకు కృషి చేయండి


పాలసముద్రం పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న డీవైఈఓ చంద్రశేఖర్

పాలసముద్రం : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని డీవైఈఓ చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం ఆయన ఆముదాల, పాలసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా పాలసముద్రం హైస్కూల్ ఉపాధ్యాయులతో ఆయన మాట్లాడారు. పదో తరగతి పబ్లిక్ పరీక్షలు దగ్గర పడుతున్నాయని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి వందశాతం ఉత్తీర్ణత సాధించేలా టీచర్లు కృషి చేయాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి పదో తరగతి విద్యార్థులను ఇంటి వద్ద కూర్చోపెట్టి చదివించాలన్నారు. ప్రభుత్వం జగనన్న గోరుముద్ద పథకంలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని నిబంధనల మేరకు మెనూ ప్రకారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజేంద్రప్రసాద్, హెచ్‌ఎంలు గణపతి, పూర్వణి పాల్గొన్నారు.

## మృతులకు నివాళి


ప్రభాకర్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కుమారస్వామిరెడ్డి

నగరి : పుత్తూరు మండలం పరమేశ్వరమంగళం వద్ద మంగళవారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ప్రభుత్వ ఆస్పత్రి శానిటరీ ఉద్యోగి నగరి మున్సిపాలిటీ చింతలపట్టెడ దళితవాడకు చెందిన ప్రభాకర్ మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మంత్రి సోదరులు కుమారస్వామి రెడ్డి బుధవారం ప్రభాకర్ మృతదేహాన్ని చర్చిలో ఉంచగా, అక్కడికే వెళ్లే పూలదండలు ఉంచి నివాళులర్పించారు. మృతుని కుటుంబసభ్యులను ఓదార్చారు. అనంతరం మండలంలోని ముడిపల్లి గ్రామానికి వెళ్లిన ఆయన స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ నాగరాజు తండ్రి గోవిందరాజులు శెట్టి మృతదేహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు పాల్గొన్నారు.

**పుత్తూరురూరల్‌లో..**

పుత్తూరు రూరల్: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అండగా ఉంటుందని పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా సోదరుడు వై.కుమారస్వామిరెడ్డి భరోసా ఇచ్చారు. బుధవారం పరమేశ్వరమంగళం వైఎస్సార్‌సీపీ నాయకులు సురేష్ తల్లి సరోజమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన గ్రామానికి వెళ్లి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆప్తులను కోల్పోయినా మనోధైర్యంతో ముందుకెళ్లాలని, మీ కుటుంబాలకు పార్టీ అన్ని వేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

## ప్రశాంతంగా ఇంటర్ తెలుగు పరీక్ష


పాలసముద్రం పరీక్ష కేంద్రంలో పోలీసుల పర్యవేక్షణ

పాలసముద్రం : మండలంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో బుధవారం ఇంటర్ మొదటి సంవత్సరం తెలుగు పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు ప్రిన్సిపల్ వినాయకం తెలిపారు. మొదటి సంవత్సరం 95 మందికి గాను 92 మంది విద్యార్థులు పరీక్ష రాశారన్నారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు అవకాశం లేకుండా పరీక్ష కేంద్రానికి విద్యార్థులు వచ్చేటప్పుడు క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతే లోపలకు అనుమతించారు.

**వడమాలపేటలో..**

వడమాలపేట : వడమాలపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు తెలుగు, హిందీ, సంస్కృతం పరీక్ష జరిగినట్లు పరీక్షల అబ్జర్వర్ చీఫ్ బాలసుబ్రమణ్యం తెలిపారు. పరీక్షలకు 265 మంది విద్యార్థులకు గానూ 262 మంది హాజరయ్యారన్నారు.

### టీబీ రహిత సమాజమే లక్ష్యం


అవగాహన కల్పిస్తున్న రాజేంద్రప్రసాద్

గంగాధరనెల్లూరు: ప్రజల భాగస్వామ్యంతో టీబీ రహిత సమాజానికి కృషి చేయాలని ఆరోగ్యవిద్యాధికారి రాజేంద్రప్రసాద్ తెలిపారు. మండలంలోని ఆత్మకూరు గ్రామంలో బుధవారం టీబీవ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ టీబీ అంటువ్యాధి అని, వ్యాధిగ్రస్తులు తుమ్మినప్పుడు, దగ్గినప్పుడు వచ్చే తుంపర్ల వల్ల ఇతరులకు రోగం సోకే అవకాశం ఉందన్నారు. 2025 నాటికి టీబీని పూర్తిగా నయం చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమన్నారు. టీబీ వ్యాధి సోకిన వ్యక్తులకు ఉచిత మందులతో పాటు ఆరు నెలల పాటు రూ.500 ప్రతి నెలా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆరునెలలు మందులు వాడితే వ్యాధి నయమవుతుందన్నారు. సీహెచ్ఓ కీర్తి, ఏఎన్ఎం అరుణకుమారి పాల్గొన్నారు.

### ఉమాపతి సేవలు ఎనలేనివి

నింద్ర: ఏపీ నిరుద్యోగ దివ్యాంగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఉమాపతి పిళ్లై చేపట్టిన సేవలకు గానూ వారం రోజుల కిందట విజయవాడలో నంది అవార్డు అందుకున్న విషయం విదితమే. ఈ సందర్భంగా ఆయనను బుధవారం మండల కేంద్రంలో దివ్యాంగుల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులకు సహాయ సహకారాలు అందించడంలో ఉమాపతి ఎంతో కృషి చేశారని అన్నారు. అనంతరం ఆయనకు శాలువ కప్పి, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ ఏడీ శ్రీనివాస్, సహాయ కార్యదర్శి కేశవన్, నగరి నాయకులు చంద్రశేఖర్, మురళి, శివకుమారి, రఘుపతి, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

### ఫుట్‌బాల్ కోచింగ్ క్యాంప్ ప్రారంభం

పుత్తూరు రూరల్: ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో రాష్ట్ర సీనియర్ ఉమెన్ ఫుట్‌బాల్ కోచింగ్ ప్రారంభమైంది. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్కే రోజా సహకారంతో క్యాంపును ప్రారంభించినట్లు కోచ్ నవీన్‌కుమార్ తెలిపారు. ఈనెల 22న గోవాలో జరిగే అంతర్రాష్ట్ర మహిళా ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో మన రాష్ట్ర జట్టు పాల్గొంటుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయప్రకాష్, పీడీలు సూరిబాబు, రాజా, హరినాథరెడ్డి పాల్గొన్నారు.

### వేలంలో రూ.5.18 లక్షలు ఆదాయం


వేలం పాట నిర్వహిస్తున్న ఈఓ మణి

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరంలో ఆదాయ వనరుల ద్వారా పంచాయతీకి రూ.5.18,500 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓపీఎస్ మణి తెలిపారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ ధనంజయవర్మ ఆధ్వర్యంలో పంచాయతీలో ఆదాయ వనరులకు బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ వారపుసంత ద్వారా రూ.3.88 లక్షలు, దినసరి కూరగాయల మార్కెట్ ద్వారా రూ.56,500, ప్రైవేటు బస్టాండు ద్వారా రూ.27 వేలు, జంతు వధశాల ద్వారా రూ.47 వేలు ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు. పంచాయతీలో ఆదాయ వనరుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి వెచ్చించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది, పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

### తాగునీటి పైపులైన్లు ఏర్పాటు


పైపులైన్ల పనులను పరిశీలిస్తున్న సర్పంచ్

పుత్తూరు రూరల్: మండల పరిధిలోని శిరుగురాజుపాళెం గ్రామ పంచాయతీలో తాగునీటి సరఫరాలకు పైపులైన్లను ఏర్పాటు చేశారు. గ్రామ సర్పంచ్ మురళీయాదవ్ పర్యవేక్షణలో పంచాయతీ పరిధిలోని పాట్టిగుట్టలు గ్రామంలో నూతనంగా తాగునీటి పైపులైన్ల ఏర్పాటుతో చేయడంతో పాటు మరమ్మతులకు గురైన స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయించారు.

## గర్భిణులకు పౌష్టికాహారం అందజేత



నగరి ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలో పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

నగరి : ప్రభుత్వ ఆస్పత్రికి వైద్య పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు బుధవారం రోజా చారిటబుల్ ట్రస్టు ద్వారా ఉచితంగా పౌష్టికాహారం అందించారు. నగరితో పాటు పరిసర ప్రాంతాలకు చెందిన మండలాల నుంచి పలువురు గర్భిణులు పరీక్షల నిమిత్తం స్థానిక ఏరియా ఆస్పత్రికి వస్తుంటారు. ఇలా వచ్చేవారు పరీక్షల సమయంలో ఆస్పత్రిలో వేచి ఉండాల్సి వస్తుంది. అక్కడ వారు భోజనానికి ఎలాంటి ఇబ్బందులు పడకూడదని ఉచిత భోజనం అందించే మహత్తర కార్యక్రమానికి మంత్రి ఆర్కేరోజా శ్రీకారం చుట్టడమే కాకుండా నిరంతరంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం చికిత్స నిమిత్తం ఆస్పత్రికి వచ్చిన గర్భిణులు, వారితో పాటు వచ్చిన పెద్దలు, పిల్లలకు ఉచితంగా వెజిటబుల్ రైస్, గుడ్డు, పుదీన చట్నీ, చిక్కీ, అరటిపండు కూడిన పౌష్టికాహారం అందించారు. మెడికల్ సూపరింటెండెంట్ బాలకృష్ణనాయక్, ఆర్ఎంఓ గోపాల్, మెడికల్ సూపరింటెండెంట్ రాజారత్నమ్మ గర్భిణులకు భోజనం పంపిణీ చేశారు.

**పుత్తూరులో..**


పుత్తూరు ప్రభుత్వాస్పత్రిలో..

పుత్తూరు రూరల్: స్థానిక వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా వితరణతో ప్రతి బుధవారం పుత్తూరు ఆస్పత్రికి పరీక్షల నిమిత్తం వచ్చే గర్భిణులకు పౌష్టికాహార పంపిణీ కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతోంది. గర్భిణులతో పాటు వారి వెంట వచ్చే సహాయకులకు కూడా భోజనం అందిస్తున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, డాక్టర్ ఉదయ్, హాస్పిటల్ డెవలప్‌మెంట్ మెంబర్లు నారాయణస్వామి, పుష్పమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు, బుజ్జి, కడియాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్


విద్యార్థులకు అన్నదానం చేస్తున్న దాత నాగరాజు

కార్వేటినగరం: విద్యతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని డీఎం పురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం నమశ్శివాయ అన్నారు. బుధవారం మండల పరిధిలోని డీఎం ఉన్నత పాఠశాల విద్యార్థులకు అబ్దుల్ ఖాదర్(టెక్స్‌మోబాబు) జ్ఞాపకార్థం సురేంద్రనగరం గ్రామానికి చెందిన అబ్దుల్‌ఖాదర్ స్నేహితుడు నాగరాజు 166 మంది విద్యార్థులకు అన్నదానం చేశారు. అలాగే పళ్లు, స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడం ద్వారా ఉజ్వల భవిష్యత్‌కు చేరుకోగలరని సూచించారు. విద్యార్థి దశ నుంచే ఏర్పడే స్నేహం ఎంతో గొప్పదని, టెక్స్‌మోబాబు /జ్ఞాపకార్థం నాగరాజు అన్నదానం చేయడం ఆ కోవకు చెందిందేనని అన్నారు. అనంతరం దాత నాగరాజు మాట్లాడుతూ విద్యకు పేదరికం అడ్డు కాదని, ప్రతి ఒక్కరూ చదువులో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వైభవంగా గంగ జాతర


ప్రత్యేక అలంకరణలో నడివీధి గంగమ్మ

కార్వేటినగరం: మండల పరిధిలోని ఆర్కేవీబీ పేట గ్రామంలో నడివీధి గంగమ్మ జాతరను గ్రామస్తులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం రాత్రి అమ్మవారిని పట్టువస్త్ర, సుగంధ భరిత పుష్పమాలికలు, విశేష ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక వాహనంపై ప్రతిష్టించారు. మంగళవాయిద్యాలు, బాణసంచాలు పేల్చుతూ గ్రామ వీధుల్లో ఊరేగించారు. భక్తులు ఇంటింటా కర్పూర హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం ఉదయం అమ్మవారిని గ్రామ నడివీధిలో ప్రతిష్టించగా, భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అదేవిధంగా పలువురు యువకులు వివిధ రకాలైన వేషధారణలతో ఆకట్టుకున్నారు. రాత్రి అమ్మవారిని ఊరేగింపుగా జలధికి తీసుకెళ్లారు. జాతరను పురస్కరించుకుని గ్రామ వీధులను, అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే గ్రామంలో వెలసిన ఆరిమాని గంగమ్మ, సీతాలమ్మ ఆలయాల వద్ద మహిళలు పొంగళ్లు వండి పిండి దీపాలతో నైవేద్యం సమర్పించారు. మరికొందరు భక్తులు అమ్మవారికి ప్రీతికరమైన అంబలి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

## ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ


ఆల్బెండజోల్ మాత్రలను విద్యార్థులకు వేస్తున్న డాక్టర్ ధనుంజయరెడ్డి

కార్వేటినగరం: నులిపురుగుల నివారణకు ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, యూత్ రెడ్ క్రాస్ సెల్ ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ ధనుంజయరెడ్డి పిలుపునిచ్చారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం కళాశాల విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలపై ఉన్న అపోహలను వీడి ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రక్తహీనత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం 370 మంది విద్యార్థులకు మాత్రలను వేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బాలసుబ్రమణ్యం ఆచారి, అధ్యాపకులు పాల్గొన్నారు.

## వడదెబ్బ నియంత్రణపై అవగాహన


గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ మోహన్‌కృష్ణ

పాలసముద్రం : ప్రస్తుతం ఎండలు తీవ్రత అధికంగా ఉండడంతో వడదెబ్బ సోకకుండా ఓఆర్ఎస్ ద్రావణం తీసుకోవాలని వైద్యాధికారి మోహన్‌కృష్ణ అన్నారు. బుధవారం పాలసముద్రం ఆరోగ్య ఉప కేంద్రంలో గర్భిణులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆయన వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు వడదెబ్బ నియంత్రణపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో వడగాడ్పుల తీవ్రత మరింత అధికంగా ఉంటుందని, ఎండలో బయటకు వెళ్లేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్ సూపరవైజర్ మురళి, సుశీల, ఆరోగ్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు

## చెత్త నుంచి సంపద తయారీపై శ్రద్ధ పెట్టండి


చెత్త సంపద కేంద్రంలో ఎరువుల తొట్టెలను పరిశీలిస్తున్న డీఎఫ్‌టీసీ జేమ్స్, నరేష్

పాలసముద్రం : మండల పరిధిలోని అన్ని పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారీపై గ్రీన్ అంబాసిడర్లు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని డీఎఫ్‌టీసీ జేమ్స్, పంచాయతీ కార్యదర్శి నరేష్ తెలిపారు. బుధవారం వారు పాలసముద్రం చెత్త సేకరణ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రీన్ అంబాసిడర్ల ద్వారా ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను సేకరించాలన్నారు. అనంతరం చెత్తను వేరు చేసి తొట్టెల్లోకి వేసి వానపాములను వదలాలని సూచించారు. తయారైన ఎరువును రైతులకు తక్కువ ధరకు కేజీల ప్రకారం విక్రయించాలని తెలిపారు. అనంతరం ఎరువులను పరిశీలించారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.